# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈరోజు నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.**
3. **రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖమంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.**
4. **తెలంగాణలో అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఉపాధ్యాయుల అర్హత పరీక్ష – టెట్–2024 ఈ రోజు నుంచి ప్రారంభమవుతుంది.**

==========================

దేశంలో 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించే దిశగా సాగుతున్న టీబీ సీల్ సేల్ ప్రచారంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. నిన్న విజయవాడలోని రాజ్ భవన్‌లో క్షయ వ్యాధి నియంత్రణ కోసం చేపట్టిన 75వ టీబీ సీల్ సేల్ ప్రచార కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాల్లోనూ క్షయ ప్రాణాంతక వ్యాధిగా విస్తరిస్తుండడం ఆందోళనకరమని, దీన్ని నివారించేందుకు సమిష్టి కృషి అవసరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో క్షయ నుంచి కోలుకుంటున్న వారి రేటు 91 శాతంగా ఉందని, ఈ వ్యాధి నివారణలో భాగస్వాములైన వివిధ విభాగాల కృషి అభినందనీయం అని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని రాష్ట్ర శ్రీకాకుళం జిల్లా వంశధార నదిపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.. నిన్న శ్రీకాకుళం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సి ఆర్ ఎం పట్నాయక్ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, వంశధార ప్రాజెక్టు పరిధిలో ఉన్న కుడి ఎడమ కాలువలను ఆధునీకరిస్తామని చెప్పారు. నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ఒడిస్సా.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య సమన్వయానికి కృషి చేస్తామన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు నాయుడు మాట్లాడుతూ...

శ్రీకాకుళం జిల్లాకు సాగునీటిని అందించే విధంగా నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈరోజు నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈరోజు నుంచి పది రోజులపాటు కనకదుర్గా అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. దసరా ఉత్సవాల్లో తొలిరోజైనా ఈరోజు అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్నారు. ఈ అవతారం విశిష్టత గురించి ఆలయ ప్రధాన అర్చకులు శర్మ తెలియజేస్తూ..

..వాయిస్...28 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్‌కు త్వరలో భూమి పూజ చేయనున్నామని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేశ్ తెలిపారు. కేంద్ర రైల్వే పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన తరవాత తొలిసారిగా విశాఖకు వచ్చిన ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైల్వే జోన్ కార్యాలయం, ఇతర కార్యకలాపాలకు కావలసిన భూమిని రైల్వే శాఖకు అందించిందని తెలిపారు. ఉత్తరాంధ్రతో పాటు, రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేస్తానని సీఎం రమేష్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖమంత్రి ఎస్.సవిత తెలిపారు. గుంటూరులో కేంద్ర జౌళి శాఖ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన హాత్ ఖర్గా మేళా ను మంత్రి నిన్న సందర్శించి వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, చేనేత కార్మికులకు కాలానుగుణంగా వస్త్రాల రూపకల్పనలో నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగానికీ తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

తెలంగాణలో అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పోషణ్ మహా-2024' ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆరేళ్ల వరకు చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే అంగన్వాడీ ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయనున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఉపాధ్యాయుల అర్హత పరీక్ష - టెట్-2024 ఈరోజు నుంచి ప్రారంభమవుతుంది. ఈ నెల 21 వరకు జరగనున్న ఈ పరీక్షలు ఎంపిక చేసిన కేంద్రాలలో ఉదయం,

మధ్యాహ్నం జరుగుతాయి. మొదటి విడత పరీక్ష ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం విడత 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. 4 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్ సహా ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలుకు అనుమతి లేదని తెలిపారు.

-----------------------------

తెలంగాణలో బతుకమ్మ ఉత్సవాలు నిన్నటి నుంచి ప్రారంభమయ్యాయి. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, ఆడుతారు. ఈ బతుకమ్మ పండుగను ప్రకృతి, చెరువులు, మహిళా సంరక్షణకు స్ఫూర్తిని నింపే ఉత్సవంగా భావిస్తూ, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు బతుకమ్మ పండుగని జరుపుకుంటారు. నిన్న ఎంగిలిపూల బతుకమ్మను నిర్వహించగా.. ఈరోజు అటుకుల బతుకమ్మను నిర్వహిస్తారు. కాగా తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్వహిస్తోంది. చివరి రోజైన ఈ నెల 10వ తేదీన హైదరాబాదులోని ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపింది.

-----------------------------

బతుకమ్మ అంటేనే చెరువులను,.. పూలను పూజించే పండుగ అని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క తెలిపారు. నిన్న హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ మహిళలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. తొమ్మిది రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. మహిళలు ఉద్యోగ, రాజకీయాల్లో ఉన్నత స్థానాల్లో రాణించేందుకు కుటుంబాలు ప్రోత్సహించాలని మంత్రి తెలిపారు.

-----------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఈరోజు అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణానికి ముందురోజు నిర్వహించే అంకురార్పణ కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం-టిటిడి ఈ సాయంత్రం నిర్వహించనుంది. ఇప్పటికే ఈ ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను టిటిడి పూర్తిచేసింది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రంలో ఈరోజు నుంచి ఈ నెల పదో తేదీ వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అంతరిక్ష కేంద్రం డైరెక్టర్ రాజరాజన్ పేర్కొన్నారు. షార్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల్లో ఎనిమిది ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 4, 10 తేదీల్లో శ్రీహరికోటలో.. 6, 7 తేదీల్లో భీమవరంలో... 7నుంచి 9 వరకు నరసరావుపేట, నెల్లూరు, కడపలో వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే తమిళనాడులోని దిండిగల్, ధర్మపురి ఒడిశాలోని బర్గర్ లో వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ఇస్రో శాస్త్రవేత్తలు ఉపన్యాసాలు ఇస్తారని, ప్రయోగాలు, ఉపగ్రహాల ప్రదర్శనలు, విద్యార్థులకు వివిధ పోటీలు ఉంటాయని ఆయన వివరించారు.

-----------------------------

తెలుగు రాష్ట్రాల్లోకి కిందిస్థాయి గాలులు ప్రధానంగా పశ్చిమ, వాయువ్య దిశల నుంచి వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్ర ప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వెల్లడించింది. మరోవైపు తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉమ్మడి మెదక్, మహబూబ్‌నగర్‌తో పాటు వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది.

=====================